క్లుప్తంగా

1094 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో సోమవారం 1,094 బేళ్లను వివిధ కంపెనీలు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. వేలానికి 1117 బేళ్లు రాగా, 2 నోబిడ్ అయినట్లు చెప్పారు. కేజీ గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.197.39గా నమోదైందని వివరించారు.

సచివాలయం పరిశీలన

మద్దిపాడు: సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి అధికారిణి ఉషారాణి హెచ్చరించారు. మండలంలోని కొలచనకోట గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేసి డీఏను ప్రశ్నించారు. అటెండెన్స్ ట్యాంపర్ చేయడం, సర్వీసులకు సంబంధించి రూ.40 వేలు బ్యాంకులో జమ చేయకపోవడం, స్పందన కార్యక్రమంలో సరైన కారణాలు లేకుండానే గైర్హాజరైన వారికి హాజరు వేయకపోవడం, మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడం వంటి విషయాలను గమనించి డీఏగా పనిచేస్తున్న రమేష్‌ను సస్పెండ్ చేయాలని రికమండ్ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు గ్రూపులలో మెసేజ్ ద్వారా తెలిపారు.

ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ట్రై సైకిళ్లు కావాలని అడిగిన ఇద్దరు దివ్యాంగులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన వెంటనే అందజేశారు. పొదిలికి చెందిన ఎం.ఆదిలక్ష్మి, డి.ఆంజనేయులుకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ట్రై సైకిళ్లు అందించారు. దీంతో దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలి

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. పాపాయిపల్లె సమీపంలోని పోలేరమ్మ గుడి ఎదురుగా హైవే పక్కన మొబైల్ సోడా మిషన్‌ను షేక్ ఖాదర్‌వలి పెట్టుకున్నాడు. కనిగిరి వైపునకు వెళ్తున్న కారు అదుపుతప్పి కూలింగ్ సోడా మిషన్‌ను ఢీకొట్టింది. పక్కనే ఉన్న ఖాదర్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. కూలింగ్ మిషన్, ఖాదర్‌వలికి చెందిన మోటార్ సైకిల్ ముందు భాగం ధ్వంసమైంది. క్షతగాత్రుడిని 108లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాళ్లూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారక్‌నాథ్‌పై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో సోమవారం మాల మహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి దాతల చేస్తున్న చేయూతను కూడా నాడు–నేడు పనుల్లో చూపిస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో చెట్లు, విలువైన సామగ్రికి కూడా లెక్కలు లేకుండా వాటిని మాయం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యతను వారు సమావేశంలో చర్చించారు.

మోడల్ స్కూళ్లలో జిల్లా ఫస్ట్ మార్కాపురం

మార్కాపురం టౌన్: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మోడల్ స్కూళ్లలో మార్కాపురం మండలం మిట్టమీదిపల్లి స్కూల్ అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. జిల్లాలో మిట్టమీదిపల్లి, రాచర్ల, పెద్దదోర్నాల, దర్శి, కనిగిరి, ముండ్లమూరులో ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మార్కాపురం పాఠశాల విద్యార్థినులు కె.హేమలత, ఎం.సంకీర్తన 550 మార్కులు సాధించగా, 22 మంది 500కు పైగా మార్కులు, 68 మంది విద్యార్థులు ఫస్ట్ డివిజన్ మార్కులతో సత్తా చాటారు. 96.3 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

14న ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం

- అదే రోజు హనుమజ్జయంతి ఉత్సవాలు
- ముఖ్యఅతిథులుగా హాజరుకానున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు
- భక్తులు భారీగా పాల్గొనాలని విజ్ఞప్తి
- కరపత్రాలు ఆవిష్కరించిన ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ గురునాథరావు, సభ్యులు

ఒంగోలు: స్థానిక కేశవస్వామిపేటలో కొండమీద వేంచేసియున్న గంగాఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నూతన జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 14వ తేదీ భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం తెలిపారు. సోమవారం స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలో 1893 మార్చి 24న ధ్వజస్తంభం ప్రతిష్ఠించినట్లు స్తంభంపై ఉన్న రాగిరేకుల ద్వారా తెలిసిందన్నారు. అప్పట్లో దుద్దుకూరు వాస్తవ్యులు పోలిశెట్టి లక్ష్మయ్య, వారి కుమారులు గురునాథ శ్రేష్ఠి ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారన్నారు. కాలక్రమంలో ధ్వజస్తంభం వంగడంతో దాని స్థానంలో జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న ఉదయం 9.37 గంటలకు 55 అడుగుల పొడవైన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెరల్స్ గ్రానైట్స్ అధినేత చలువాది నాగేశ్వరరావు, వారి కుటుంబీకులు చేపడుతున్నారన్నారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు హాజరవుతారని తెలిపారు. భక్తులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శంకరమంచి రామకృష్ణ మాట్లాడుతూ 1968లో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరస్వామి విచ్చేసి మహాకుంభాభిషేకం నిర్వహింపజేశారని, తాజాగా కంచి కామకోటి పీఠాధిపతి అయిన విజయేంద్ర సరస్వతిస్వామి ఆలయానికి విచ్చేసి మహాకుంభాభిషేకం నిర్వహించాలని సూచించారని తెలిపారు. భక్తుల సహకారంతో ఆ కార్యక్రమాన్ని ఈ నెల 14న నిర్వహిస్తున్నామన్నారు. ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థాన మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 14న హనుమజ్జయంతిని దృష్టిలో ఉంచుకుని ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలోని ఉపాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఆ కార్యక్రమాలు కూడా ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 14న స్వామివారికి పంచామృత అభిషేకం, 10 గంటలకు సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణం, సాయంత్రం 7 గంటలకు నగరోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావడంతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మి సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు

ఒంగోలు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు 30 ఏళ్లు అవిశ్రాంతంగా సేవలందించిన డాక్టర్ విజయలక్ష్మి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు, కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ విజయలక్ష్మి స్మారకార్థం మాతృదినోత్సవం సందర్భంగా కరవది గ్రామంలోని రాధాకృష్ణ నర్సింగ్‌హోంలో సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సభ నిర్వహించారు. జి.శివాజీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకట్రామయ్య, వివేకానంద విద్యావిహార్ కరస్పాండెట్ రఘుపతి, డి.వి.హెచ్.ఎస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఆర్.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక


వీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85వ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించి నేడు వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సోమవారం సాయంత్రం కలుసుకున్నారు. 37 ఏళ్ల తర్వాత కలుసుకుని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఐలతో పాటు వివిధ వృత్తుల్లో ఉన్న వారు చిన్న నాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. తమ ఉన్నతికి పాటు పడిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత ఇవ్వాల్సిన ఆవశ్యకతను చర్చించుకున్నారు.

లారీలు ఢీ, డ్రైవర్లకు గాయాలు


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

మేదరమెట్ల: రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇరువురి డ్రైవర్లకు గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన లారీ డివైడర్ దిమ్మెలను గుద్దుకుంటూ మరో రోడ్డులో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో అదుపు తప్పిన లారీ రోడ్డు మధ్యలో డివైడర్‌గా ఉంచిన సిమెంటు దిమ్మెలను ఢీ కొట్టుకుంటూ ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరికి గాయాలయ్యాయి. ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసులు కష్టించి బయటకు తీసి చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల ఎస్సై పీ.నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించి, కేసు నమోదు చేశారు.

సీఎంలా అందరికీ న్యాయం చేశా


సన్మానం అందుకుంటున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

- కులాలు, మతాలు, పార్టీలు చూడలేదు
- వీడ్కోలు సభలో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

దర్శి: కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడమంటూ సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలా తానూ దర్శి సబ్ డివిజన్‌లో పోలీసు విధులు నిర్వర్తించానని డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి అన్నారు. స్థానిక పీజీఎస్ సమావేశం హాలులో బదిలీపై వెళ్లిన నారాయణస్వామిరెడ్డికి దర్శి పోలీసులు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతగా పని చేస్తే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. తప్పులు జరిగినప్పుడు అధికారులపై కోప్పడి ఉంటే తప్పుగా అనుకోవద్దన్నారు. తనకు ఎవరిపైనా ప్రత్యేకించి కోపం ఉండదన్నారు. కార్యక్రమంలో సీఐ జె. రామకోటయ్య, ఎస్‌ఐ రామకృష్ణ, సంఘ సేవకుడు జీవీ రత్నం పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభం

కురిచేడు: ఖరీఫ్ సీజన్ కింద పచ్చిరొట్ట పంట విత్తనాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి ప్రకాశ్‌రావు తెలిపారు. జనుములు 10 కిలోలు 50 శాతం సబ్సిడీతో రూ.420, జీలుగ 10 కిలోలు రూ.395లు, పిల్లిపెసర 8 కిలోలు రూ.388 ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రామ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు పొలం పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో పాటు ఫోన్ ఓటీపీ ద్వారా విత్తన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

15న తపాలా జీవిత బీమాలో ఏజెంట్ల ఎంపిక

ఒంగోలు సబర్బన్: భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాలా జీవిత బీమా మరియు గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను సేకరించేందుకు ఏజెంట్ల నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రకాశం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్(ఎస్ఎస్‌పీ) డి.రమణయ్య తెలిపారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక భాగ్యనగర్ రెండో లైన్‌లోని ఎస్ఎస్‌పీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన ఏజెంట్లకు వారు సేకరించిన పాలసీలపై ఆకర్షణీయమైన కమీషన్ చెల్లించడం జరుగుతుందన్నారు. అందుకోసం కనీసం 10వ తరగతి పాసై ఉండాలని, వయసు 19 నుంచి 50 సంవత్సరాల్లోపు ఉండాలని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. ఎంపికైన వారు రూ.5 వేలను నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ లేదా కిసాన్ వికాస్ పత్రం అకౌంట్ రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని సూచించారు.

అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

గిద్దలూరు రూరల్: తమిళనాడు రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం అరుణాచలం వెళ్లేందుకు భక్తులు సౌలభ్యం కోసం నూతనంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 25 మందికి మించి భక్తులు ఉంటే బస్సు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. బస్సు బద్వేలు, కడప మీదుగా అరుణాచలం వెళ్తుందని చెప్పారు. అనంతరం భక్తులు గిరిప్రదక్షణ చేసుకున్న తర్వాత తిరిగి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ వంటి క్షేత్రాలు చూపించుకుని గిద్దలూరు చేరుకుంటుంది. సూపర్ లగ్జరి బస్సుకు రూ.2,500, అల్ట్రా డీలక్స్‌కు రూ.2000 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు డీఎం తెలిపారు. గిద్దలూరు డిపో నుంచి రోజుకు 73 సర్వీసులు తిరుగుతున్నాయని, రూ.10 నుంచి 15 లక్షల వరకు వసూలు వస్తుందన్నారు. డిపో ఆవరణలోని ఖాళీ స్థలానికి 15 నుంచి 30 సంవత్సరాల వరకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అదుపుతప్పి బోల్తా కొట్టిన లారీ

కొమరోలు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగింది. మిర్యాలగూడ నుంచి కడపకు పేపర్ తయారు చేసే మెటీరియల్‌తో వెళ్తున్న లారీ ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే డ్రైవర్ మొహిద్దీన్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. ఆ వెంటనే లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా క్లీనర్ సురక్షితంగా బయటపడ్డాడు.


బోల్తా పడిన లారీ

మల్లవరం వెంకటేశ్వరుడిని దర్శించుకున్న శిద్దా


స్వామివారిని దర్శించుకుంటున్న శిద్దా రాఘవరావు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామిని సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు. శిద్దా వెంట ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, పలువురు ప్రముఖులు ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బదరీనారాయణ


మద్దిపాడులో శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న లైబ్రేరియన్ వసుంధర, విశ్రాంత ఉపాధ్యాయులు

చీమకుర్తి: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ అన్నారు. ఈ నెల 8 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు గ్రంథాలయంలో పేపర్ రీడింగ్, కథలు చెప్పించడం, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి పలు రకాల కార్యక్రమాలలో శిక్షణ ఇవ్వడం మంచి విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించే కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కే సత్యనారాయణ, చలువాది రమేష్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని మద్దిపాడు, ఏడుగుండ్లపాడు గ్రామాల్లో గల గ్రంథాలయాల్లో చిన్నారులకు సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకూ విద్యార్థులకు చిత్రలేఖనం, పెయింటింగ్, కుట్లు, అల్లికలు, డిబేట్ వంటి అంశాలలో శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథపాలకులు వసుంధర, రోహిణి చెప్పారు. 15 సంవత్సరాల్లోపు వారు శిక్షణకు అర్హులన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని, సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉపాధి హామీ పథకం సీవో, ఏఏల కమిటీ ఏర్పాటు


ఉపాధి హామీ పథకం సీవోలు, ఏఏల నూతన కమిటీ

ఒంగోలు సబర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు (సీవోలు), అకౌంట్స్ అసిస్టెంట్లు (ఏఏలు) అసోసియేషన్ నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఒంగోలు డ్వామా కార్యాలయంలో ఏర్పాటైన నూతన కమిటీలో గౌరవాధ్యక్షునిగా మద్దిపాడుకు చెందిన సీవో సీహెచ్ రమేష్‌బాబు, గౌరవ సలహాదారులుగా ఒంగోలుకు చెందిన సాధనాల రమేష్, తాళ్లూరుకు చెందిన పి.వెంకటేశ్వర్లు, అధ్యక్షునిగా కొండపికి చెందిన వి.సంగీత కవిత, ప్రధాన కార్యదర్శిగా మార్కాపురం క్లస్టర్‌కు చెందిన కే వెంకట నారాయణ, కోశాధికారిగా కొమరోలుకు చెందిన డి.నిరంజన్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా దర్శి క్లస్టర్‌కు చెందిన ఎస్.సురేష్, ఒంగోలుకు చెందిన పి.ఇజ్రాయేల్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు జాయింట్ సెక్రటరీలుగా ఒంగోలు డ్వామా కార్యాలయంలోని సీవో వై.సుజాత, త్రిపురాంతకంకు చెందిన డి.ఖాశింవలి, మరికొంతమంది కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా కమిటీని డ్వామా పీడీ పి.శీనారెడ్డి అభినందించారు.

పేద ముస్లింల కోసమే కమిటీ ఏర్పాటు


నూతన కమిటీ

కొత్తపట్నం: మండలంలోని పేద ముస్లింల అభివృద్ధి కోసమే అన్ నుష్ రహ అనే పేరుతో మండల కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ అధ్యక్షుడు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. కొత్తపట్నంలో జామియా మసీద్ వద్ద సోమవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ మండలంలో ఆరు మసీదులను కలుపుకుని మండల నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏ ముస్లిం కుటుంబమైనా కష్టకాలంలో ఉంటే కమిటీ తరఫున ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రతి ఏటా రంజాన్ తోఫా అందిస్తామని అన్నారు. మండలంలోని ముస్లింలంతా ఐక్యంగా ఉండి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం మస్తాన్‌వలి ఆధ్వర్యంలో 20 మందికి ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఎస్‌కే గౌస్‌బాషా, పఠాన్ పాపా మస్తాన్, అధ్యక్షుడు పఠాన్ సలీం, కార్యదర్శి అల్లూరు షరీఫ్, కోశాధికారి, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కాలేషా, ఉర్దూ స్కూల్ కమిటీ చైర్మన్ మస్తాన్‌వలి, సైకిల్ షాపు ఓనర్ మస్తాన్‌వలి, ఇతర కమిటీ సభ్యులు, అల్లూరు అహ్మదీయ మసీద్, ఈతముక్కల మదీనా మసీద్, మడనూరు మదీనా మసీద్, రాజుపాలెం అహ్మదీయ మసీద్ పెద్దలు, నిర్వాహకులు, ముస్లింలు పాల్గొన్నారు.